# అడుగు భాగానికి తగులకుండ శిఖరమునకు చేరుకునేది ఎలా

### (2 సమూ. 8-12; 21; 23; 1 దినవృ. 11; 18-20; 23; 27)

వ్యక్తిత్వాభివృద్ధికి సంబంధించి ఎలా విజయవంతంగా ఉండాలి, అపజయాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాల మీదనే పుస్తకాల షాపులోని పుస్తకాలన్నీ ఉంటాయి. సంపూర్ణ విజయానికి పద్ధతి, జయించే కళ, విజయానికే పుట్టాడా, నీవు అధిగమించవచ్చు, ఎన్నటికిని ఓటమి చవి చూడని విజయం వంటి అనేక విషయాలమీద వుంటాయి. ఒత్తిడి, గ్లాని, ఆత్మాభిమానం లేకపోవడం, నిరాశ, కష్టసాధ్యమైన ప్రజలు, కోపము, దూషణ భయం, దుఃఖము అనేవాటిని ఎలా ఎదుర్కోవాలో పుస్తకాలు చెప్పుతాయి. కాని ఏ పుస్తకమూ విజయంతో ఎలా సమన్వయించుకోవాలో చెప్పదు.

విజయం కలిగి ఎలా మసలుకోవాలో ఎరగడం మనకు అవశ్యకంగా ఉంది. విపత్తు సంభవించినప్పుడు మనం సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటాం. తుఫాను ఒక ప్రాంతాన్ని నాశనం చేసినా, వరదలు వచ్చి పొలాలు యిండ్లు కొట్టుకు పోయినా, యిరుగు పొరుగున అగ్ని ప్రమాదం జరిగినా, మనం అలా బాధింపబడిన స్థలాల చుట్టు తిరుగుతాం. సమయాన్ని, డబ్బును, వారికి సహాయపడడానికి శక్తిని ధారపోస్తాం. అన్నీ సజావుగా సాగిపోతున్నప్పుడు మాత్రమే, స్నేహ సంబంధమైన పోటీపడుతూ, మన మార్గంలో జనులను ఉపయోగించుకొంటూ, విడిచి పోతూ సాగిపోతాం.

విజయం వచ్చినప్పుడు, మన దృష్టికోణాన్ని కోల్పోతాం. ఆమెరికాలో ఆర్థిక పరిస్థితులను గూర్చి మనం ఫిర్యాదు చేస్తూ ఉంటాం. ఇతరులకంటె మనం 99 శాతం ఎంతో మెరుగుగా ఉన్నా ఈ పని మనం చేస్తాం. మనం ఎంత కష్టపడి పని చేయాలో ఫిర్యాదు చేస్తుంటాం కాని మన పూర్వికులకంటె ఎంతో విశ్రాంతిని అనుభవిస్తునే ఉంటాం. మనకున్న ధనం, విరామం సమయంతో ఒక విధంగా మనం "శిఖరానికి చేరుకున్నట్టే," అయినా, మనలో ఎక్కువ మంది "అడుగు భాగాన్ని తగులుతునే" ఉంటారు.

విజయంతో మనం ఎలా మసలుకోవాలి? మన ఆత్మలను విడిచిపెట్టకుండా విజయవంతంగా ఎలా కొనసాగాలో దావీదు జీవితంలోనుండి కొన్ని సలహాలను ఏరి తీసికొందాం. దావీదు జీవితపు వెలుగును పాపము కప్పివేయక ముందు అతని సంతోషకరమైన సంవత్సరాలను గూర్చి చదువుదాం.

దావీదు స్థాపించిన రాజ్యముపై దృష్టి నిలపడం జరుగుతుంది. ఈ సంఘటనల ప్రాముఖ్యతను మనం తక్కువగా అంచనా వేయరాదు. ఈ కాలము, సొలొమోను పరిపాలనలోని తొలి సంవత్సరాలు యూదుల "స్వర్ణ యుగంగా" ఎల్లప్పుడు ఉంటుంది. అదే సమయంలో, దేశం యొక్క సంపూర్ణ పతనం కొద్ది వచనాల్లో తెలుపబడుతుంది. దానికి భిన్నంగా, అధ్యాయాలకు అధ్యాయాలే, యెరూషలేముకు మందసాన్ని తరలించడం

లాంటి ఆత్మ సంబంధమైన సంగతులే తీసికొంటాయి. అలాటి సంగతులను బైబిలు అవలోకనముగా భద్రపరచుతుంది.

ఏదియెలాగున్నా, ఇంతకు విషయమేమంటే, దావీదు యుద్ధ శూరుడుగాను, ఏలికగాను, రాజుగాను విజయాన్ని సాధించాడు. తన విజయాల రికార్డును మనం ఒకసారి తిరిగి ఆలోచిస్తే, తనకు సామర్థ్యమును కలిగించిన సంగతులు – జీవితంలోని ప్రాముఖ్యమైన వాటిని కోల్పోకుండ అతన్ని శిఖరాగ్రానికి చేర్చాయి – అలాగే అవి మనకు తెలుపుతాయి.

## దావీదు శిఖరాగ్రమునకు చేరుకున్నాడు

2 సమూ. 8–10లో రాజైన దావీదు సాధించిన వాటి జాబితా శిఖరాగ్రాన్ని చేరుకొంది. దావీదు జీవితంలో చెడ్డ దినాలు సంభవించడానికి ఈ అధ్యాయాలు వేదికగా నిలిచి ఉన్నాయి.

### రాజ్యం స్థాపింపబడింది (2 సమూ. 8; 21; 23; 1 దినవృ. 11; 18; 20)

2 సమూ. 8 యొక్క సంక్షిప్త సందేశం దావీదు సైనిక విజయాలకు సంబంధించినది. ఆ విజయాలను గూర్చి చదువేటప్పుడు మూడు సంగతులను మనం గుర్తుంచుకోవాలి: (1) పూర్వ కాలం అబ్రాహాముకు యివ్వబడిన భూ వాగ్దానాన్ని దావీదు నెరవేర్చుతున్నాడు (ఆది. 15:18–21). (2) గతకాలంలో యెహోషువ ఆరంభించిన దానిని దావీదు సంపూర్తి చేస్తున్నాడు (యెహోషువ 1:4; 21:43). (3) దేవాలయ నిర్మాణానికి ముందు అవసరమని దేవుడు తెలియజేసిన సమాధానాన్ని దావీదు స్థాపిస్తున్నాడు.

**పడమరకు.** సైనిక విజయాల జాబితా, శాశ్వతమైన ఇశ్రాయేలు శత్రువులైన ఫిలిష్తీయాతో ఆరంభమౌతుంది ( దేశ పటాన్ని చూడు). “దావీదు ఫిలిష్తీయులను ఓడించి[1] లోబరచుకొని వారి వశమునుండి మెతెగమ్మాను[2] (అంటే గాతును[3]) పట్టుకొనెను” (2 సమూ. 8:1).

దావీదు ఫిలిష్తీయులతో చేసిన యుద్ధాలు అనేకాలు. తమ చుట్టునున్న దేశాలతో దావీదు చేసిన యుద్ధాలకు నమూనాగా నిలచిన దీనిని క్లుప్తంగా పరిశీలించుదాం. ఇశ్రాయేలీయులందరి మీద దావీదు రాజుగా చేయబడక ముందు అతడు వారితో చేసిన రెండు యుద్ధాలను గూర్చి మనం ముందుగానే చదివాం (2 సమూ. 5). 2 సమూయేలు అంతమందున్న అనుబంధంలో, ఫిలిష్తీయులను అతడు ఎదుర్కొన్న క్లుప్త వర్ణనలను మనం కనుగొంటాం.[4]

2 సమూ. 21:15–22లో ప్రసిద్ధిగాంచిన గొల్యాతుకు సంబంధించినట్టున్న నాల్గు యుద్ధాల్లో ఫిలిష్తీయ సర్దారులు చంపబడ్డారు. మొదటిలో, యుద్ధం పొడిగించబడింది. దావీదు అలసిన వాడయ్యాడు (“మామూలుకంటె ఈ ఖడ్గం ఎందుకు బరువయ్యింది? నేను గతంలో తిప్పినంత వేగంగా నేనిప్పుడు ఎందుకు తిప్పలేకపోతున్నాను? తప్పక నేను ముసలివాడను కావడం లేదు కదా? తప్పక కావడం లేదు!” అతడు గొణిగినట్టు

రచయిత ఊహించగలడట). "రెఫాయీయుల సంతతివాడగు ఇష్బిబేనోబ" అనువాడు అలసట చెందిన దావీదును కనుగొని "గొల్యాతును చంపినవాని చంపి" పేరు తెచ్చుకొన బూనాడు (16 వ.). గొప్ప శూలంతో[5] అతడు రాజు మీదికి లేచాడు.[6] యోవాబు సహోదరుడును, నేరంలో పాలివాడునైన అబిషై–ఎవడినైనా చంపాలి అనే భావంగలవాడై[7] జరిగిన దాన్ని చూచి దావీదు ప్రక్కకు వచ్చాడు. ఈసారి శత్రువును చంపడానికి అతడు దావీదు అనుమతిని పొందలేదు; అయితే వానిని చంపివేశాడు. (అతడు తలకాయ నొప్పియైనా, దావీదు వానిని ఎందుకు తనచుట్టు ఉంచుకుంటాడో ఈ సంఘటన కొంతవరకు మనకు తెలుపుతోంది).

దావీదు దగ్గర ఉండడానికి అతని మనుష్యులు యిష్టపడలేదు. ఈసారి యింటివద్దనే ఉండమని వారతని కోరతారు: "దావీదు జనులు దీనిచూచి, ఇశ్రాయేలీయులకు దీపమగు నీవు ఆరిపోకుండునట్లు నీవు ఇక మీదట మాతో కూడ యుద్ధమునకు రావద్దని అతనిచేత ప్రమాణము చేయించిరి" (17 వ.). చీకటి గదికి వెలుగునిచ్చే బంగారు దీప స్తంభానికి యిది సూచనగా ఉండవచ్చు. పరిశుద్ధ స్థలంలో ఉండే దీప కాంతి అదే. ఇశ్రాయేలు దేశానికి దావీదు అతి గొప్ప ఆధారమైనట్టు వారు గుర్తించారు.

రెండవ యుద్ధములో, మరొక ఇశ్రాయేలు సైనికుడు మరొక గొల్యాతు సంతతివానిని చంపాడు (18 వ.). మూడవ యుద్ధంలో దావీదు యొక్క "బలశూరులు"[8] గొల్యాతుకు సమీప బంధువుడైన మరియొకని చంపినట్టున్నారు.[9] నాల్గవ యుద్ధంలో కాళ్లకు చేతులకు ఆరేసి వేళ్లు కలిగియున్న మరొకని దావీదు బంధువులలో ఒకడు చంపాడు (20, 21 వచనాలు).

పైగా, దావీదు యొక్క "బలశూరులు" జరిగించిన గొప్ప కార్యాలను గూర్చి, ఫిలిష్తీయులతో వారు చేసిన యుద్ధాలను గూర్చి 2 సమూయేలు 23లో పేర్కొనబడ్డాయి. ఉదాహరణకు, ఒకప్పుడు ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయులతో యుద్ధం చేస్తున్నప్పుడు ఒక వీరుడు తప్ప తక్కిన ఇశ్రాయేలీయులందరు వెనుకకు మళ్లారు. "కత్తి తన చేతిలో అతుక్కుపోయేవరకు" అతడు యుద్ధం చేయ మానలేదు. అతని శౌర్యాన్ని మహోన్నతుడు ఘనపరచాడు: "ఆ దినమున యెహోవా ఇశ్రాయేలీయులకు గొప్ప రక్షణ కలుగ జేసెను" (10 వ.). మరో సందర్భంలో, ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయులతో యుద్ధము చేస్తుండగా, అందరు పారిపోయినప్పుడు, ఒక్క ఇశ్రాయేలీయుడు మాత్రమే గట్టిగా చేని మధ్యను నిలిచి ఫిలిష్తీయులు దాని మీదికి రాకుండ వారిని వెళ్లగొట్టి వారిని హతము చేయుటవలన "యెహోవా ఇశ్రాయేలీయులకు గొప్ప రక్షణ కలుగజేసెను" (12 వ.).

ఫిలిష్తీయులను ఎదుర్కొనినప్పుడు, దావీదు జీవితంలో సంభవించినవాటిలో మనస్సు కరిగించెడు దృశ్యాన్ని ఒక దాన్ని మనం చదువుతాం. ఫిలిష్తీయుల సేనలు దావీదు స్వగ్రామమైన బేత్లెహేములో నిలిచియున్నాయి. దావీదును అతని జనులును ఊరికి వెలుపలనున్నారు. దావీదు బేత్లెహేమును గూర్చి ఆలోచించినప్పుడు, అనురాగంతో నింపబడినవాడై తన ఆలోచనలను బయటికి యిలా వ్యక్తపరచాడు: "బేత్లెహేము గవిని దగ్గరనున్న బావి నీళ్లు ఎవడైనను నాకు తెచ్చి యిచ్చిన యెడల ఎంతో సంతోషించెదను ..." (2 సమూ. 23:15). అది విన్నపం కాదు; అది దావీదు కోర్కె. అల్పుడుగా లేత ప్రాయపు

వాడుగా ఉన్నప్పుడు తాను త్రాగిన నీళ్లు మళ్లీ త్రాగితే బాగుంటుందనుకున్నాడు. తన చుట్టునున్న వారు దావీదును ఎంతగా ప్రేమిస్తున్నారంటే, అతని కోర్కెను ఉత్తరువుగా వారు భావించారు. దావీదు యొక్క బలశూరులు ఫిలిష్తీయులను ఛేదించుకొంటూ పోయి నీళ్లు చేదుకొని తిరిగి వారిని ఛేదించుకొంటూ వచ్చి ఆ నీళ్లను తమ సైన్యాధిపతికి త్రాగనిచ్చారు.

వారు దావీదు ఎదుట వంగి అతనికి గిన్నె అందిస్తున్నట్టు నేను వారిని చూస్తాను. ఆ నీటిని తీసికొని రావడంలో వారి వస్త్రాలు చినిగిపోయి రక్తమయమై ఉంటాయి, వారి దేహాలు గాయాలతో నిండి ఉంటాయి – అదంతా తమ ప్రియతమ నాయకునికి త్రాగ నీళ్లు తీసికొని రావడానికే. అతడు ఆ గిన్నె పట్టుకొని ఆ నీటిని త్రాగ నిరాకరించాడు. దావీదు ఉద్వేగంచే ఆపబడ్డాడు ఎందుకంటే ఆ నీటిని తీసికొని వచ్చేదానికి అతని శూరులు తమ ప్రాణాలను త్యజించారు. యెహోవాకు పానీయార్పణంగా పోసినట్లు మెల్లగా అతడు ఆ నీటిని నేలపై పోశాడు. దాహము గొన్న భూమి ఆ నీటిని ఆశ్వాదిస్తుండగా, అతడిట్లన్నాడు: "–యెహోవా, నేను ఇవి త్రాగను; ప్రాణమునకు తెగించి పోయి తెచ్చినవారి చేతి నీళ్లు త్రాగుదునా? అని చెప్పి త్రాగనొల్లకుండెను" (17 వ.). తన మనుష్యులకు దావీదు యొక్క అభినందన అంత త్వరగా మరచి పోయేది కాదు.

ఫిలిష్తీయులపై సాధించిన యితర విజయాలను గూర్చిన ఉదాహరణలు యింకా యిచ్చుకొంటూ పోవచ్చు. అయితే "దావీదు ఫిలిష్తీయులను ఓడించి లోపరచుకొని ..." అనే మాటల్లో పేర్కొనబడినవన్నీ సంక్షిప్తం చేయబడింది (2 సమూ. 8:1). ఆయా దేశాల మీద దావీదు సాధించిన యుద్ధ విజయాలను సర్వే చేసేటప్పుడు ఈ విషయాన్ని జ్ఞాపకం ఉంచుకో. రక్తము, చెమట, కన్నీళ్లు ప్రతి వచనాన్ని తడుపుతాయి. దావీదు సామ్రాజ్య స్థాపనకు సంబంధించి, "దావీదు ఫిలిష్తీయులను ఓడించి లోపరచుకొని" అనే మాటలు పశ్చిమ దిశను అతడు తన శత్రువులను జయించినట్టు సూచిస్తుంది.

**తూర్పు వైపున.** తూర్పు వైపున దావీదు తన శత్రువులను జయించినట్టు 2 సమూ. 8:2లో మనం చూస్తాం:

> మరియు అతడు మోయాబీయులను ఓడించి, (పట్టుబడినవారిని) నేలపొడుగున పండజేసి, తాడుతో కొలిచి రెండుతాడుల పొడుగు నున్నవారు చావవలెననియు, ఒక తాడు పొడుగు నున్నవారు బ్రతుకవచ్చుననియు నిర్ణయించెను. అంతట మోయాబీయులు దావీదునకు దాసులై కప్పము చెల్లించుచుండిరి.

మోయాబీయులు అబ్రాహామునకు బంధువుడైన లోతు సంతతివారు.[10] మోయాబు విభాగింపబడిన దేశం. తూర్పునుండి ఆగ్నేయంగా మృత సముద్రంవరకు అది అరణ్య భూమి. 2వ వచనం మనం బదులు చెప్పలేని ప్రశ్నలను అడగడానికి దారితీస్తుంది. దైవ ప్రేరేపితమైన రికార్డుకు సంబంధించినంత మట్టుకు, మోయాబీయులతో దావీదుకున్న సంబంధం సరిగానే ఉంది.[11] అతడు పారి పోయినవాడుగా ఉన్నప్పుడు తన తల్లిదండ్రుల యొక్క యోగ క్షేమం మోయాబు రాజు చేతికి అప్పగించాడు.[12] దీనంతటితో కూడ, ఏ దేశానికి చూపనంత క్రూరత్వాన్ని మోయాబీయుల యెడల కనుపరచి[13] వారిలో మూడింట

రెండు వంతులను అతడు సంహరించాడు.[14] అలా చేయడానికి అతని ప్రోత్సహించిందేమి? దావీదు కుటుంబాన్ని అతని తల్లిదండ్రులను మోయాబీయులు హతం చేయడమే దావీదు వారికి ఈ కాఠిన్యం చూపడానికి హేతువని యూదా రచయితలంటారు.[15] ఇది కారణమై యుండవచ్చు కాకపోవచ్చు కూడా. దావీదు చర్యకు మనకు కారణం తెలియనందున, దాన్ని బట్టి మనం మనకు అంగీకారం లేకపోయినా, దావీదు తప్పో ఒప్పో మనం చెప్పలేం.

దావీదు అమ్మోనీయులను కూడా జయించాడు.[16] మోయాబుకు ఉత్తర దిశగా యొర్దానుకు తూర్పు వైపునున్న ఎడారి వాసులు – అమ్మోనీయులు. మోయాబీయులవలె అమ్మోనీయులు కూడా లోతు సంతతివారే.[17] ఈ విధంగా తూర్పున ఉన్న ఇశ్రాయేలీయుల శత్రువులు లోపరచబడ్డారు.

**ఉత్తరం వైపుకు.** ఉత్తర దిశగా దావీదు విజయాల వైపుకు దృష్టి మల్చుదాం: "సోబా రాజును రెహోబు కుమారుడునగు హదదెజరు యూఫ్రటీసు నదివరకు తన రాజ్యమును వ్యాపింపజేయవలెనని బయలుదేరగా దావీదు అతనినోడించి ..." (2 సమూ. 8:3). సోబా, సిరియాలో భాగమైయుండి, దమస్కుకు ఉత్తరముననున్న పర్వత శ్రేణులతో నిండిన దేశమైయుంది. యూఫ్రటీసు నది ప్రక్కన ఉన్న భూ భాగాన్ని తిరిగి పట్టుకోవాలని సోబా రాజు యుద్ధం చేస్తూ ఉండగా, వెనుకనుండి దావీదు అతని సైన్యం మీద పడ్డాడు. దావీదు గొప్ప విజయం సాధించి, 21, 700 మందిని బందీలుగా పట్టుకొన్నాడు.[18] అతడు అనేక గుర్రములను రథములను కూడా పట్టుకున్నాడు.[19]

వారి రాజధాని నగరు ప్రక్కనే ఉన్న పట్టణాన్ని దావీదు పట్టుకొనగా, సిరియనులు[20] నిర్వీరులయ్యారు, అయినను వారు సోబా రాజుకు సహాయంగా త్వరపడి వచ్చారు. దావీదు 22, 000 మంది సిరియనులను చంపాడు. బ్రతికియున్న సిరియనులు ఇశ్రాయేలుకు కప్పం కట్టేవారుగా చేయబడ్డారు. దావీదు విజయవంతంగా తన సామ్రాజ్యాన్ని ఉత్తరమున యూఫ్రటీసు నదివరకు వ్యాపింపజేశాడు.

ఇంతటి సాహస కార్యాన్ని దావీదు ఎలా చేయగలిగాడో 2 సమూ. 8:6 నొక్కి చెప్తుతోంది. దావీదు సైనిక ప్రజ్ఞా శాలి, ధైర్యశాలియైన నాయకుడు. అతని జనులు పోరాడే యంత్రాలు; కాని తన విజయానికి కేవలం యివే కారణాలు కానేరవు. "తాను ఎక్కడికి వెళ్లినా **యెహోవా** దావీదుకు సహాయం చేశాడు." ఈ మాటలను గుర్తుంచుకో; పాఠంలోని ఈ భాగానికి ఆ మాటలే చర్చనీయాంశం.

తన విజయ యాత్రల్లో కొల్లగొట్టిన సొమ్మును అతడు తిరిగి యెరూషలేమునకు కొనిపోయాడు. బంగారు డాళ్లు, ఎక్కువైన యిత్తడి కూడా యిందులో యిమిడియుంది. "వీటన్నిటిని అతడు తన దేవునికి అర్పించాడు" (2 సమూ. 8:11). కొల్లగొట్టిన దానిలో ఎక్కువ భాగం దేవాలయపు మూల ధనంగా ఉంచాడు.[21]

లోకమందలి సంపద దావీదు రూకల పెట్టెలతో నింపబడుతోంది. తన పాత శత్రువైన సోబా రాజు జయింపబడిన సంగతి హమాతు రాజు విన్నప్పుడు,[22] అతడు దావీదునకు బంగారము, వెండి, యిత్తడిని బహుమానంగా పంపాడు.[23] దావీదు పట్టుకున్న: సిరియా, మోయాబు, అమ్మోను, ఫిలిష్తీయా, అమాలేకు,[24] సోబా దేశముల నుండి ప్రశస్తమైన

లోహాలు కురిపించబడ్డాయి. (తరువాత లక్ష మణుగుల బంగారము, పది లక్షల మణుగుల వెండి[25] తాను సమకూర్చినట్టు దావీదు సొలొమోనుకు తెలుపుతాడు. అది లెక్కలేనంత డబ్బు!)

**దక్షిణం వైపుకు.** దావీదు తన సామ్రాజ్యాన్ని పడమర, తూర్పు, ఉత్తరం వైపులకు వ్యాపింపజేశాడు. దక్షణపు వైపుకు యిప్పుడు మన దృష్టిని మల్చుదాం. దక్షణాన ఎదోము ఉంది. 2 సమూ. 8:13 యిలా అంటుంది: "దావీదు ఉప్పు లోయలో సిరియనులగు పదునెనిమిది వేలమందిని హతము చేసి తిరిగి రాగా అతని పేరు ప్రసిద్ధమాయెను"[26] ఉప్పు లోయ మృత సముద్రానికి దక్షిణముగా ఉన్నందున, 1 దినవృ. 18:12లోని క్రాస్ రిఫరెన్స్ "ఎదోమీయులను" సూచిస్తున్నందున, సిరియనులు అనేదానికంటే ఎదోమీయు లనేది సరిగా ఉండవచ్చు.[27] దావీదు ఎదోమీయులను ఓడించడంతో, దక్షిణాది వర్తకమునకై అక్వబ గల్ఫ్‌కు మార్గం సరాళం చేయబడింది.

2 సమూ. 8:14లో తిరిగి కీలకమైన పద ప్రయోగం యిలా చేయబడింది: "దావీదు ఎక్కడికి పోయినను యెహోవా అతనిని కాపాడుచుండెను." ఈ సత్యముపై కీర్తన. 60 వ్యాఖ్యానమైయున్నది. ఉప్పు లోయలోని యుద్ధముయొక్క ఆరంభ దశలో అది వ్రాయబడింది.[28] అది వ్రాయబడిన సమయంలో ఎదోమీయులతో యుద్ధం సరిగా సాగలేదు. అది యిలా ఆరంభమౌతుంది: "దేవా, మమ్ము విడనాడియున్నావు. మమ్ము చెదరగొట్టి యున్నావు; నీవు కోపపడితివి; మమ్ము మరల బాగుచేయుము" (1 వ.). "ఆ కోటగల పట్టణములోనికి నన్నెవడు తోడుకొని పోవును? ఎదోములోనికి నన్నెవడు నడిపించును?" అని దావీదు అడుగుతున్నాడు (9 వ.). ఆ కీర్తన చివరి భాగంలో తన ప్రశ్నకు తానే యిలా బదులు చెప్పుకొంటున్నాడు: "దేవునివలన మేము శూరకార్య ములను జరిగించెదము మా శత్రువులను అణగద్రొక్కువాడు ఆయనే" (12 వ.). తనకు విజయం కలిగించింది ఎవరో దావీదు ఎన్నడు మరచిపోలేదు.

### రాజ్యము పొందికపరచబడింది (2 సమూ. 8; 1 దినవృ. 23–27)

2 సమూయేలు 8వ అధ్యాయం దావీదు పరిపాలనను గూర్చి సంగ్రహంగా చెప్పుతోంది: "దావీదు ఇశ్రాయేలీయులందరి మీద రాజై తన జనులనందరిని నీతి న్యాయములనుబట్టి యేలుచుండెను" (15 వ.). ఇతరులు రాజ్యములో న్యాయాధిపతులుగా ఉండిరి, గాని విన్నవించుకొనడానికి రాజే చివరి న్యాయ స్థానమైయున్నాడు. దేవుని ప్రతినిధిగా రాజు పక్షపాతము లేనివాడుగాను న్యాయవంతుడుగాను ఉండాలి.[29]

దావీదు పరిపాలనాదక్షుడై ఉండి అధికారాన్ని యితరులకు ఎలా అప్పగించాలో ఎరిగినవాడై యున్నట్టు 2 సమూ. 8:16–18 తెలుపుతుంది. యోవాబు సైన్యాధిపతిగా ఉండేవాడు. ఏమి సంభవిస్తున్నాయో వాటిని "దాఖలు" చేసి ప్రకటించే రాజ్యపు దస్తావేజుల మీద యెహోషాపాతు ఉండేవాడు. సాదోకును అహీమెలెకును ప్రధాన యాజకులుగా పని జరిగించారు (కొద్ది కాలం ఇశ్రాయేలీయులకు యిద్దరు ప్రధాన యాజకులున్నట్టు కన్పిస్తుంది: ఆరంభంలో సాదోకు గిబియాలోని ప్రత్యక్ష గుడారమునొద్దను,[30] అహీమెలెకు యెరూషలేము మందసం వద్దను ఉన్నట్టున్నారు.[31] దావీదు "బలశూరులలో,"[32] ఒకడు

దేహ సంరక్షకుల అధిపతిగా నియమించబడ్డాడు. కూలికి పని చేయడానికి క్రేతు[33] ఫిలిష్తీయనుండి[34] వచ్చినవారున్నారు. రాజ్యపు లేఖకుడు రాజ్య సంబంధమైన డాక్యూమెంట్స్‌ను రికార్డు చేస్తూ భద్రపరచేవాడున్నాడు. దావీదు తన కుమారులను సహితము ప్రభుత్వంలో వినియోగించుకున్నాడు. 2 సమూ. 8:18 వారిని "సభా ముఖ్యులు" అని పిలిచింది. 1 దినవృ. 18:17, "రాజునకు సహాయులు" అని పిలిచింది.[35]

దావీదు ఎంత గొప్ప కార్య నిర్వాహకుడో నీవు తెలిసికోగోరితే, 1 దినవృ. 23-27 చదువు. మతపరమైన సేవలకు అతడు లేవీయులను నియమించిన పద్ధతి అందులో ఎక్కువగా కన్పిస్తుంది (23-26 అధ్యాయాలు). యుద్ధానికి నిత్యము సిద్ధముగానున్న సైన్యాన్ని సహితం దావీదు నిర్వహించాడు (27:1-24). వ్యవసాయం ప్రాముఖ్యమైన దైనందున భూమికి బాధ్యులైనవారిని సహా అతడు నిర్వహించాడు (27:25-31). అతనికి సలహా దారులను, అతని కుమారులకు నేర్పించేవారిని నియమించాడు (27:32-34). విజయవంతులైన మనుష్యులు వివరాలను గూర్చి విచారించువారై యున్నారు.

**వాగ్దానం నెరవేర్చబడింది (2 సమూ. 9)**

"దావీదు జీవితమంతటిలో మనస్సు కరిగించెడు సంఘటనలో" ఒకటి 2 సమూ. 9లో ఉంది. దావీదు యోనాతానుల స్నేహపు గాథకు తగినట్టి శిఖరాగ్రమది.[36]

దావీదు ఇశ్రాయేలీయులందరిపై రాజుగా అభిషేకింపబడి దాదాపు పది సంవత్సరాలు గడిచిపోయాయి. అతని సామ్రాజ్యము స్థిరపరచబడి, ఫలాభివృద్ధి చెందుతోంది. అతని ప్రభుత్వము నిర్వహింపబడినదై చక్కగా పని చేస్తుంది. ఆలోచించడానికి అతనికి సమయముంది. అతని ఆలోచనలు ఒక సైనిక వీరునివైపు మళ్లాయి. ఇశ్రాయేలు అంతటిలో యువ రాజుగాను తన స్నేహితుడుగాను ఉండి - స్వార్థరహితమైన ప్రేమను పంచినవానికి రెండు దశాబ్దాలకు ముందు చేసిన వాగ్దానం జ్ఞాపకం వచ్చింది. దావీదు తన ప్రాణ రక్షణకై పారిపోకముందు తానును ఆ యువక రాజ కుమారుడును పొలములో నిలుచుండగా, యోనాతాను తన ఏకైక విన్నపాన్ని యిలా విన్నవించుకున్నాడు: "అయితే (నీవు రాజువైనప్పుడు) నేను బ్రదికియుండినయెడల నేను చావకుండ యెహోవా దయచూపునట్లుగా నీవు నాకు దయచూపక పోయిన యెడలనేమి, నేను చనిపోయిన యెడల యెహోవా దావీదు శత్రువులను ఒకడైన భూమిమీద నిలువకుండ నిర్మూలము చేసిన తరువాత నీవు నా సంతతివారికి దయ చూపకపోయిన యెడలనేమి యెహోవా నిన్ను విసర్జించును గాక" (1 సమూ. 20:14, 15). యోనాతానుకును అతని కుటుంబానికిని ఎల్లప్పుడు దయచూపుదునని దావీదు వాగ్దానం చేశాడు (1 సమూ. 20:17).

తన మాటను నిలబెట్టుకునే సమయం దావీదుకు ఆసన్నమయ్యింది. తాను యోనాతానుకు ఏ విధంగాను సహాయం చేయలేకపోయాడు. గిల్బోవ పర్వతం మీద ఫిలిష్తీయుల బాణ వర్షం క్రిందపడి యోనాతాను మృతినొందాడు. యోనాతాను కుటుంబికులలో ఎవరైనా బ్రదికియుంటే, వారిపట్ల అతని వాగ్దానాన్ని నిలబెట్టుకోగలడు.

అయితే, వారిని కనుగొనడం ఎలా అనేది సమస్య. సింహాసనానికి పోటీపడే

శత్రువులెవరైనా ఉంటే, ఈ ప్రాంతపు రాజులు అలాటివారిని చంపుతారు. అందువలన గద్దె దింపబడిన రాజుకు సంబంధించిన జనం ఉన్నా, బయటికి కనిపించరు. అయితే దావీదు యిలా అడుగుతున్నాడు, "–యోనాతానును బట్టి నేను ఉపకారము చూపుటకు సౌలు కుటుంబములో ఎవడైనా కలడా?" (2 సమూ. 9:1). సౌలు యొక్క కుమార్తెలలో ఒకతెయైన–మీకాలు తన యింటనే ఉన్నది. తన కుటుంబానికి చెందినవారు ఎక్కడున్నది ఆమెకు తెలిసినా, ఆమె వారిని గూర్చి దావీదుకు తెలిపినట్టు లేదు. అయితే సీబా అనే సౌలుయొక్క సేవకుని గూర్చి ఎవరో ఒకరు దావీదుకు తెలియజేశాడు. "రాజు–యెహోవా నాకు దయచూపినట్లుగా నేను ఉపకారము చేయుటకు సౌలు కుటుంబములో ఎవడైన నొకడు శేషించియున్నాడా" అని అతనినడుగగా, సీబా "–యోనాతానుకు కుంటి కాళ్లుగల కుమారుడొకడున్నాడని రాజుతో మనవి చేసెను" (2 సమూ. 9:3).[37]

ఈ కుమారుని పేరు మెఫీబోషెతు (లేక మెరిబాలు[38]) అతడు అయిదు సంవత్సరాల ప్రాయమందు అతని తాత తండ్రులు చంపబడ్డారు.[39] సౌలు యోనాతానులు చనిపోయిన సంగతి అతని దాది విని భయకంపితురాలై–వారిని కూడా ఫిలిష్తీయులు చంపుదురను భయముతో, పసివాడైన మెఫీబోషెతును ఎత్తుకొని, పరుగు పరుగున పరుగెత్తుతూ ఉండ ఆమె పడిపోయింది. ఎత్తుకున్న బిడ్డతో ఆమె పడిపోగా, ఆ బిడ్డ కాళ్లు కుంటివైపోయాయి.

లోదెబారులో ఉన్న మాకీరు,[40] యింట ఈ పసివానికి ఆశ్రయం లభించింది. యొర్దానుకు[41] తూర్పున గిలాదు ప్రాంతపు లోపలి భాగంలో అది యొక పల్లెసీమ. దావీదు దర్బారుకు చాలా దూరంలో అది ఉంది. ఆ ఒంటరి కుగ్రామంలో, గుర్తింపు లేకుండగనే ఎదిగాడు, వివాహితుడయ్యాడు, ఒక బిడ్డకు తండ్రిగా కూడా అయ్యాడు.[42] తన్ను అందరు మరచిపోయాడనుకున్నాడు. ఇప్పుడు అతడు అనామకుడుగా ఉండిన తన స్థితిని కోల్పోబోతున్నాడు.

> అతడెక్కడ ఉన్నాడని రాజు అడుగగా సీబా – చిత్తగించుము, అతడు లోదెబారులో అమ్మీయేలు[43] కుమారుడగు మాకీరు ఇంట నున్నాడని రాజుతో అనెను. అప్పుడు రాజైన దావీదు మనుష్యులను పంపి లోదెబారులోనున్న అమ్మీయేలు కుమారుడగు మాకీరు ఇంటనుండి అతని రప్పించెను (2 సమూ. 9:4, 5).

తన్ను లోదెబారునుండి యెరూషలేమునకు తీసికొనిపోవుటకు వచ్చిన వాహనం, ఆయుధ ధారులైన కావలివారితో చుట్టబడినప్పుడు, మెఫీబోషెతు మనస్సులోని ఆందోళన భయము అనేవాటిని మనం ఊహించలేం. "దయ చూపాలని" దావీదు కోరుకున్న మాట వాస్తవమే, కాని తన రాజ్య సింహాసనానికి వెసరు పెట్టగలిగే శత్రు శేషాన్ని తుంచి వేయాలన్న కోర్కెకూడా ఉండవచ్చుననేది ఆ భయాందోళనకు హేతువై యుండవచ్చు. (జ్ఞానులు హేరోదుకు బాలుడైయున్న యేసును గూర్చిన వర్తమానం తెస్తే, తాను కూడా వెళ్లి పూజిస్తానని అతడు ఉపయోగించిన తంత్రం ఉంది కదా.[44]) ఒకవేళ దావీదు తన తండ్రితో చేసిన వాగ్దానాన్ని గూర్చి మెఫీబోషెతు వినియుండవచ్చు; లేకపోవచ్చు కూడా. ఎలాగైనా, 20 సంవత్సరాలకు ముందు చేసిన వాగ్దానం మీద అతడు తన ప్రాణాన్ని యిరుకులో పెట్టుకొనగోరడు.

వారు రాజ నగరునకు చేరుకున్నప్పుడు, మెఫీబోషెతు కుంటి నడకతో[45] దావీదు సముఖానికి వచ్చి చేరుకున్నాడు. రాజ కుమారుడును తెగువగల సేనా నాయకుడును తన స్నేహితుడును అయ్యుండిన యోనాతాను పోలికలు అతనియందున్నవేమోనని దావీదు ఆ యువక కుంటివానివైపు తేరి చూచియుండవచ్చు. మెఫీబోషెతూ, అని అతడు పిలిచాడు.[46] సాగిలపడి నమస్కారము[47] చేసిన మెఫీబోషెతు, "–చిత్తము, నీ దాసుడనైన నేనున్నాననెను" (2 సమూ. 9:6).

ఆ యువకుని స్వరంలో ఉన్న భీతిని దావీదు విన్నాడు. రాజు అతని లేవనెత్తి యిలా అభయమిచ్చాడు: "–నీవు భయపడవద్దు, నీ తండ్రియైన యోనాతాను నిమిత్తము నిజముగా నేను నీకు ఉపకారము చూపి, నీ పితరుడైన సౌలు భూమి అంతయు నీకు మరల ఇప్పింతును; మరియు నీవు సదాకాలము నా బల్లయొద్దనే భోజనము చేయుదువని సెలవియ్యగా" (2 సమూ. 9:7).

చట్ట బద్ధంగా, దావీదు రాజైనప్పుడు, సౌలుకున్న సమస్తము తనవైపోతాయి. సౌలు యొక్క వారసులకు వాటిని యివ్వవలసిన పని దావీదుకు లేదు. అలా చేయడం కేవలం కృపా కార్యమే. దావీదు హృదయంలో యింకను సజీవంగా ఉన్న మెఫీబోషెతు యొక్క తండ్రికి అతడు కనుపరచే ప్రేమాకార్యమే. అప్పటికప్పుడే దయమీద ఆధారపడిన మెఫీబోషెతు గొప్ప ధనవంతుడుగా మారిపోయాడు. అంతకంటే, అతి శ్రేష్ఠమైన ఘనత, అతనిని తన భోజనపు బల్లవద్దకు ఆహ్వానించడం. అది రాజ కుమారులకు యివ్వబడే హక్కైయుంటుంది. మెఫీబోషెతు రాజ గృహమునకు తిరిగి వచ్చి, రాజ కుమారునిగా చూడబడడానికి, ప్రాముఖ్యమైన గౌరవపదమైన స్థితికి పునరుద్ధరింపబడినవాడై యున్నాడు.

మెఫీబోషెతు ఆనందంతో ముంచివేయబడినట్టున్నాడు. అతడు తిరిగి రాజునకు నమస్కరించి, "–చచ్చిన కుక్క[48]వంటివాడనైన నా యెడల నీవు దయ చూపుటకు నీ దాసుడనగు నేను ఎంతటివాడను? అనెను" (2 సమూ. 9:8). తాను మెఫీబోషెతుకు యిస్తున్నది నిజమైన ఈవియేనని రుజువు చేయడానికిని అతనికి అభయమియ్యడానికిని, దావీదు సీబాను పిలిపించి అతని కొత్త సొత్తుకు, వానిని గృహ నిర్వాహకునిగా చేశాడు.[49]

వెంటనే మెఫీబోషెతు తన కుటుంబాన్ని, నివాసాన్ని పట్టణానికి తరలించాడు. "మెఫీబోషెతు యెరూషలేములో కాపురముండి సదాకాలము రాజు బల్లయొద్ద భోజనము చేయుచుండెను" (2 సమూ. 9:13). మెఫీబోషెతు యొక్క జీవితాన్ని ధన్యం చేసింది కేవలం కృపా కార్యమే. అది దావీదును ధన్యునిగా చేసిన మాట వాస్తవమే. భోజన సమయంలో మెఫీబోషెతును బల్ల దగ్గర వీక్షిస్తున్న దావీదు యోనాతానుతో తాను కలిసి పొలముల్లో సంచరించిన సంగతులను గుర్తు చేసికొని చిరునగవుతో ఉన్నట్టు రచయిత చూడగలడట.[50] ఎవరికి దయ చూపించామో అది వారిని దీవించునంతకంటె దయను చూపించినవారిని అది అధికంగా దీవిస్తుంది.

**విజయం సాధించబడింది (2 సమూ. 10–12; 1 దినవృ. 19; 20)**

దావీదు "మంచి దినాలు" అనే భాగం 2 సమూ. 1–10, గత అధ్యాయంలోని ఫుట్ నోట్‌తో ముగుస్తాయి. 8వ అధ్యాయములో "అమ్మోను కుమారులు" దావీదుకు

కప్పం పంపారు (12 వ.). అయితే అమ్మోనీయులను ఓడించిన రికార్డు అక్కడ లేదు. 10నుండి 12 అధ్యాయాలలో అమ్మోనీయులతో జరిగిన యుద్ధ వివరాలు యివ్వబడ్డాయి. 8వ అధ్యాయంలో, అర్మేనీయులు లేక "సిరియనులు దావీదునకు దాసులై కప్పము చెల్లించుచుండిరి" (6 వ.). 8వ అధ్యాయం సిరియనులతో జరిగిన కొన్ని యుద్ధాలను గూర్చి తెలుపుతుంది, కాని 10 అధ్యాయం "మిగిలిన కథను తెలుపుతుంది" –అంటే ఎప్పుడు, ఎలా సిరియనులు చివరిగా లోబరచబడ్డారనే వివరాలను యిస్తుంది.

9, 10 అధ్యాయాల మధ్యగల బంధం దయ అనే చర్చనీయాంశమై ఉంది. రెండింటిలోను, తమ తండ్రులను బట్టి దావీదు వారి కుమారులకు దయ చూపుతాడు. 9వ అధ్యాయంలో, దయ అనే వరాన్ని కృతజ్ఞతతో అంగీకరింపగా, 10 అధ్యాయంలో అది కఠినంగా తిరస్కరించబడింది.

పదో అధ్యాయం యిలా ప్రారంభించబడుతుంది,

> పిమ్మట అమ్మోను రాజు మృతి నొందగా[51] అతని కుమారుడగు హానూను అతని రాజ్యము నేలుచుండెను. దావీదు – హానూను తండ్రియైన నాహాషు నాకు చేసిన ఉపకారమునకు నేను హానూనునకు ప్రత్యుపకారము చేతుననుకొని, అతని తండ్రి నిమిత్తము అతని నోదార్చుటకై తన సేవకులచేత సమాచారము పంపించెను (1, 2 వచనాలు).

అమ్మోనీయుల రాజు దావీదునకు ఏ ఉపకారం చేసింది మనకు తెలియదు. అతడు పారిపోతున్నవాడుగా ఉన్న దినములలో[52] ఏదైనా ఉపకారం చేసియుండవచ్చునేమో. ఏమైనా సరే, దయకు దయ ప్రత్యుత్తరంగా యివ్వాలనేది దావీదు కోర్కె.

అమ్మోనీయుల రాజధాని నగరు రబ్బా[53] పట్టణానికి, హానూనుకు తన కనికరాన్ని అందించాలని దావీదు తన సేవకులను పంపాడు. ఏదియెలాగున్నా, దావీదు మనుష్యులు దయను అందించడానికి కాక దేశాన్ని వేగు చూడడానికి వచ్చి యున్నారని రాజ కుమారుడు ఒప్పింపబడ్డాడు. అందునుబట్టి అమ్మోను రాజు ప్రత్యుత్తరం రెండంతల అవమానంతో పంపబడింది. "అంతట హానూను దావీదు పంపించిన సేవకులను పట్టుకొని, సగము గడ్డము గొరిగించి వారు తొడుగుకొనిన బట్టలను నడిమికి పిఱ్ఱలమట్టుకు కత్తిరించి వారిని వెళ్లగొట్టెను" (2 సమూ. 10:4). కొంతమంది నేడు సంపూర్ణంగా గడ్డం గొరిగించు కొంటున్నా, సహజంగా గడ్డం పెంచుకొనడం మగతనానికి గురుతైయుంటుంది. ఒక్కొక్కని గడ్డంలో కొంతవరకు మట్టుకే గొరిగించడంలో – మీరు మగాళ్లే కాదు పొండిరా అన్నట్టయ్యింది. రెండవ అవమానం వారి బట్టలను నడిమికి పిఱ్ఱలవరకు కత్తిరించడం. దానితో వారు సగంవరకు వస్త్ర హీనులుగా చేయబడ్డారు. యుద్ధ ఖైదీలు ట్రీట్ చేయబడే మార్గం అదే.[54]

అవమానపరచబడి ధర్మసంకటంలో పడియున్న దావీదు సేవకులు తిరిగి వచ్చారు. దావీదు ఉగ్రుడయ్యాడు. అయినా, అమ్మోనీయులు యుద్ధానికి సిద్ధపడుతున్నారన్న సంగతి విని, తమాయించుకొని – మరియు వారితో కూడా యుద్ధం చేయడానికి ముప్పై వేలమందిని కూలికి పెట్టుకొన్న సంగతి తెలిసికొని[55] (వారిలో మూడింట రెండంతలు

సిరియనులని దావీదు ఎరిగాడు.[56]) వెంటనే దావీదు తన సేనలో శ్రేష్ఠులను యుద్ధానికి పంపాడు.

యోవాబు రబ్బా పట్టణానికి వెళ్లినప్పుడు, అతడు రెండు దిశలుగా యుద్ధం చేయవలసిన వాడైనట్టు కనుగొన్నాడు: అమ్మోనీయులు రాజధానిని కాపాడుకొంటుండగా, రెండవ సైనిక గుంపు వెనుక తట్టునుండి వారిమీద పడడానికి ప్రయత్నించింది. ఓటమి కలిగేలా కన్పిస్తుంది. అది యోవాబు యొక్క మంచి తరుణం కావచ్చు. యోవాబు తన శ్రేష్ఠులైన వారితో కూలికి పెట్టుకున్నవారితో యుద్ధం చేయసాగాడు. అమ్మోనీయులతో పోరాడడానికి గాను తన సహోదరుడైన అబీషైని క్రింద ఉంచాడు. అప్పుడు అతడు తన మనుష్యులను పిలిచి అతడు వారితో యిలా ఆజ్ఞాపించాడు:

> ... అబీషైకి అప్పగించి సిరియనుల బలము నాకు మించినయెడల నీవు నన్ను ఆదుకొనవలెను, అమ్మోనీయుల బలము నీకు మించిన యెడల నేను వచ్చి నిన్ను ఆదుకొందునని చెప్పి అమ్మోనీయులను ఎదుర్కొనుటకై తనవారిని వ్యూహపరచెను. అప్పుడు–ధైర్యము తెచ్చుకొమ్ము, మన జనులను మన దేవుని పట్టణములను తలంచుకొని ధైర్యము తెచ్చుకొందము, తన దృష్టికి ఏది యనుకూలమో, యెహోవా దానిని చేయునుగాక అని అబీషైతో చెప్పి ... (2 సమూ. 10:11, 12).

అది నిజంగా ఉద్రేకపరచే సందేశం. యోవాబు యొక్క సహజమైన స్వభావాన్ని అనుసరించింది కాదు. ప్రతి నాయకుడు దానినుండి నేర్చుకోవలసియుంటుంది. సహకారము యొక్క అవసరత, ధైర్యము యొక్క అవసరత, యితరుల యెడల కనుపరచే అక్కర, దేవుని చిత్తానికి అనుగుణంగా జరగాలనే అవసరత అనేవి బహు బలీయమైన ఉద్దేశాలైయున్నాయి. తన సందేశాన్ని ముగించుతున్న సమయంలో, యోవాబు తన తలను వంచిన స్థితిలో నేను చూడగలను. అప్పుడు ఆ మనుష్యుల యొక్క కేకలు కొండలగుండా ప్రతిధ్వనించుతున్నట్టు నేను వినగలను (అని రచయిత అంటాడు). చివరిగా, గొప్ప కష్టాలను ఎదుర్కొనడానికి ముందుకు సాగుతున్న వారి కండ్లలోని అగ్నిని నేను చూడగలను – ఇశ్రాయేలీయుల మహిమకొరకు, దేవుని మహిమకొరకు.

ఆ దినమున దేవుడు యోవాబుకు గొప్ప విజయాన్ని ప్రసాదించాడు. సిరియనులు చెల్లాచెదురయ్యారు; అమ్మోనీయులు రబ్బాకు తిరిగి వెళ్లారు. తన్ను నమ్ముకున్నవారితో ప్రభువు ఉన్నాడు.

ఓడిపోయిన సిరియనులు తిరిగి వారి స్వదేశానికి చేరుకున్నప్పుడు, సిరియా దేశపు నాయకులు[57] కోపోద్రేకులయ్యారు. ఇశ్రాయేలీయులకు విరోధంగా గొప్ప సైన్యాన్ని సమకూర్చుకున్నారు, యూఫ్రటీసు నదిని దాటియున్న జనులను సహితం సైన్యంలో చేర్చుకున్నారు.

గొప్ప సైన్యం దగ్గరకు వస్తున్న సంగతిని గూర్చి దావీదు విన్నప్పుడు, సైన్యాన్ని మరియొకనికి అప్పగించలేని పరిస్థితి ఏర్పడినట్టు దావీదు గుర్తించాడు. దావీదు స్వయంగా తానే సిరియనుల "సైన్యాన్ని ఎదుర్కొనడానికి ఇశ్రాయేలీయులను సమకూర్చుకొని యొర్దాను నదిని దాటాడు" (2 సమూ. 10:17). ఇశ్రాయేలీయులకు దేవుడు మహా

గొప్ప విజయాన్ని మరోసారి యిచ్చాడు. వారి సైన్యాధిపతితో కూడ నలభై ఏడువేలమంది సిరియనులు కూలిపోయారు. "... తాము ఇశ్రాయేలీయుల యెదుట నిలువలేకుండ కొట్టబడియుండుట చూచి ఇశ్రాయేలీయులతో సమాధానపడి వారికి లోబడిరి" (2 సమూ. 10:19).[58]

అమ్మోనీయుల సైన్యం రబ్బాకు అడ్డుకట్ట యింకను వేసియుంచినందున ఈ పని యింకను ముగియనట్టు మిగిలియుంది. తరువాత వసంత కాలంలో, ప్రయాణాలు సాధ్యమయ్యేటప్పుడు, రబ్బా పట్టణాన్ని పట్టుకొనడానికి దావీదు యోవాబును పంపి, తాను యెరూషలేములో నిలిచియుంటాడు.[59] (దావీదు బత్షెబతో పాపం చేసిన సమయమది. ప్రస్తుతం కథలో ఆ భాగాన్ని విడిచి పెడతాం. అమ్మోనీయులతో జరిగించిన యుద్ధపు కథను ముగించిన దినవృత్తాంతముల రచయిత మాదిరిలో వెళ్లదాం.[60])

యోవాబు మొదట రబ్బాను నేరుగా ఎదుర్కొన్నాడు గాని ఆ పట్టణానికి బీటలు వేయడం కుదరలేదు.[61] తరువాత ఆ పట్టణానికి నీటి ఆధారాలను అతడు పట్టుకొన్నాడు.[62] నీటి సరఫరాను అతడు బంధించివేసినందున, పట్టణవాసులు లోబడడానికి కొంత కాలం తీసికొంటుందన్న సంగతి యోవాబుకు తెలుసు. "నేను పట్టణమును పట్టుకొని నా పేరు దానికి పెట్టకుండునట్లు మిగిలిన దండువారిని సమకూర్చి నీవు పట్టణమును పట్టుకొన వలెనని" దావీదుకు వర్తమానం పంపబడింది (2 సమూ. 12:28).[63]

దావీదు రబ్బాకు వచ్చి చివరిగా సైన్యాన్ని నడిపించాడు. పట్టణం పట్టబడింది. అమ్మోనీయుల రాజ కిరీటం దావీదు తలమీద పెట్టబడింది. అతడు వారికి క్రొత్త ఏలికయై యున్నట్టు దానివలన వారికి సూచింపబడింది.[64] అప్పుడు దావీదు ...

> ... పట్టణములో ఉన్నవారిని బయటికి తెప్పించి రంపములచేతను పదునుగల యినుప పనిముట్లచేతను ఇనుప గొడ్డండ్లచేతను వారిని తుత్తినియలుగా చేయించి వారిని ఇటుక ఆవములో వేసెను. అమ్మోనీయుల పట్టణములన్నిటికి అతడు ఈలాగు చేసెను. ఆ తరువాత దావీదును జనులందరును తిరిగి యెరూషలేమునకు వచ్చిరి (2 సమూ. 12:31; NIV).[65]

రికార్డుకు సంబంధించినంతవరకు, దావీదు యొక్క జీవిత కాలంలో, చుట్టునున్న దేశములు పెద్ద ఎత్తున ఎదురు తిరగడం అనేది యిదే చివరి సారి.

చాలా కాలం క్రిందట, "–ఐగుప్తు నది మొదలుకొని గొప్ప నదియైన యూఫ్రటీసు నదివరకు, నీ సంతానమున కిచ్చియున్నానని" దేవుడు అబ్రాహాముతో నిబంధన చేశాడు (ఆది. 15:18 పోల్చి చూడు). కడకు దావీదు ద్వారా దేవుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చాడు. దక్షిణమున ఐగుప్తు[66] మొదలుకొని ఉత్తరమున యూఫ్రటీస్ నదివరకు, పశ్చిమమున మహా (మధ్యధరా) సముద్రమునుండి, తూర్పున యొర్దాను ప్రాంతంవరకు దావీదు సామ్రాజ్యము విస్తరించింది,[67] 6000 చదరపు మైళ్ళ విస్తీర్ణాన్ని దావీదు ఏలాడు. దాదాపు 90 శాతం లోకపు ధనం అతని రాజ దండం క్రింద ఉంది.

తాను కనగల పిచ్చి కలలన్నిటిని అధిగమించి, బేత్లెహేమీయుడైన గొర్రెలు కాచుకొనే బాలుని దేవుడు మహా విజయవంతునిగా చేశాడు.

# నిజంగా ప్రాముఖ్యమైన దానిని పోగొట్టుకోకుండ విజయాన్ని సాధించడం ఎలా?

దావీదు శిఖరాగ్రానికి లేచిన కథలో ఏమి పాఠాలున్నాయి? ప్రత్యేకించి, మన ఆత్మలతో సహా - నిజంగా ప్రాముఖ్యమైన దానిని పోగొట్టుకొనకుండ విజయాన్ని సాధించడం ఎలా? దావీదు యొక్క విజయాన్ని గూర్చి నేను ఆలోచిస్తుండగా, అయిదు సలహాలను నేను రూపొందించాను:

**(1) నీ ఉద్దేశాన్ని మరచిపోవద్దు.**

విజయం తరచుగా చెడ్డ పేరు తెస్తుంది మరియు మంచిపేరు తెస్తుంది. అది కొన్ని సార్లు త్రోవ తప్పిస్తుంది, దానికి ఫలితంగా అపజయం వస్తుంది. చాలా ఉదాహరణల నివ్వవచ్చు: విజయం యొక్క వత్తిడికి తట్టుకోలేని T.V లేక సినీ స్టార్ తన జీవితాన్ని మద్యానికి, మత్తు మందులకు లోనుచేసి పాడుచేసికోవచ్చు. జాతీయ ఛాంపియన్ షిప్పును గెలుచుకున్న జట్టు తరువాత సంవత్సరంలో విఫలం కావచ్చు; రాజకీయవేత్త తనకు యివ్వబడిన అధికారాన్ని బట్టి పాడుకావచ్చు.

తన ఉద్దేశాల్లో దావీదు త్రోవ తప్పినట్టును-తత్ ఫలితంగా ఘోరమైన విపత్తు వాటిల్లినట్టును తరువాత చూడబోతాం. అయితే, యిక్కడ దేవుడు తన ఎదుట ఉంచిన గొప్ప కార్యాల మీద దావీదు దృష్టి నిలిపాడు: సింహాసనంపై అతడు దేవుని ప్రతినిధిగా నిలిచాడు, సామ్రాజ్యాన్ని స్థాపించాడు, మెస్సీయా ఏ జనాంగంగుండా వస్తాడో ఆ దేశాన్ని అతడు భద్రం చేశాడు. దావీదు కేంద్రంగా నిలిచియున్నందున, ఆ సవాలును అతడు మహా ఘనంగా నెరవేర్చాడు.

గురి నిలుపుకొనడాన్ని గూర్చి మనం ఎక్కువగా వింటూ ఉంటాం. పెట్టుకొన్న గమ్యాలు విలువగలవైనప్పుడు, గురి నిలుపుకొనడం విలువగలదే అయ్యుంటుంది. మన ప్రాధాన్యతలను తిన్నగా పెట్టుకోవాలి: దేవుడు మొదట, తక్కినవి తరువాత. (జాబితాలో కుటుంబం పైనుండాలి, మనం కడపటిగా ఉండాలి.[68]) మనం మన గురులను నిలుపుకొన్నప్పుడు, వాటినుండి తొలిగిపోవడం సులభమే. జీవితం ఏమైయుందో మనం మరచిపోతాం. నిజంగా ముఖ్యమైనదేదో దాన్ని మరచిపోకుండ మనం పని చేయాలి.

వన్నెకెక్కిన పౌలు ప్రతిపాదనను జ్ఞాపకం ఉంచుకో: "... అయితే ఒకటి చేయుచున్నాను. వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తు యేసునందు దేవుని ఉన్నత పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీ. 3:13, 14). "ఒకటి చేయుచున్నాను" అనే పద ప్రయోగాన్ని గుర్తించు. "ఒక డజను సంగతులను ప్రయత్నిస్తున్నాను" కాదు, "ఒకటి మాత్రం చేస్తున్నాను." పౌలు క్రీస్తు మీద దృష్టి నిలిపి ప్రదర్శింపబడినవాడు.

నీ జీవితంలో దేవుడు ఏమి చేయగోరుతున్నాడో ఆలోచించి ప్రార్థించి తీర్మానించుకో. ఆ ఉద్దేశాలు గమ్యాలు మరచిపోకు. వాటిమీద దృష్టి నిలుపు.

**(2) నీ రుణాన్ని మరచిపోకు.**

నీకు కొంత విజయం చేకూరినట్లయితే, దాన్ని సాధ్యం చేసిన వారికి నీవు రుణపడి యున్నావు అన్న సంగతిని మరచిపోకు. తాము ఎక్కడ నిలిచారో అక్కడికి చేరడానికి సహాయపడిన "చిన్నవారిని" "గొప్పవారు" తరచుగా మరచిపోతారు.

తన విజయానికి యితరులు సమర్పించినవాటిని దావీదు గుర్తించాడు. దావీదు "ఘనపరచినవారి జాబితాను" నేను మరోసారి జ్ఞాపకం చేస్తాను. 2 సమూ. 23లో తన బలశూరులను వారి సాహస కార్యాలను దావీదు పేర్కొంటాడు. అంతటికి పైగా దావీదు తన విజయాలకు దేవుడైన యెహోవాకే ఘనతనిస్తాడు. కీర్తన. 60లో అతడిలా అన్నాడు: "**దేవుని** వలన మేము శూరకార్యములను జరిగించెదము మా శత్రువులను అణగ ద్రొక్కువాడు **ఆయనే**" (12 వ.; నొక్కి పలకడం నాది). తన యుద్ధ విజయాలనుండి తెచ్చిన సొత్తును అతడు దేవునికి సమర్పించాడు.

తన జీవితంలో దేవుడును నరులును చేసిన ఉపకారాలను గుర్తించిన మరొక వ్యక్తి పౌలు. ఉదాహరణకు, రోమా 16లో, ఫీబేను గూర్చి అతడిలా అన్నాడు: "ఆమె ... నాకును సహాయకురాలై యుండెను" (1, 2 వచనాలు). ఇంకా ముందు, తన రచనలో, "మన బలహీనతలను చూచి సహాయము చేయుచున్నాడు" అని పరిశుద్ధాత్మను గూర్చి పౌలు పలికాడు (రోమా 8:26). భక్తిగల సహోదరి పౌలుకు సహాయపడింది, దేవుడు సహాయం చేశాడు. మరియు రెండు మూలాలనుండి వచ్చే సహాయాన్ని గుర్తించుడని పౌలు మనలను కోరుకుంటున్నాడు.

ఎప్పుడైనా మనం ఏ విజయం సాధించినా, అది ఎంత చిన్నగానైనా, యితరులు సహాయపడతారు. ఆ కానుకను మనం గుర్తించాలి. సభా వేదిక మీద నిలిచి, "నేను నా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులు, వగైరాలకు వందనాలు తెలుపుతున్నాను" అనే అవకాశం నీకు ఎన్నడే లభించకపోవచ్చు. అయితే వారు మనకు చేసిన దానిని మనం ఎంతగా అభినందిస్తున్నామో మనం వారికి తెలుపగలం. ముఖా ముఖిగా గాని, ఫోన్ కాల్ ద్వారాగాని, లేక చిన్న ఉత్తరం ముక్క ద్వారాగాని తెలిపితే ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

అంతటికి పైగా, విజయాన్ని సాధ్యం చేసేది దేవుడు అన్న విషయాన్ని మనం గుర్తించాలి. అసాధారణమైన ఒక క్రీడా కార్యాన్ని ఒకడు జరిగించితే, అతడు దానిని ఎలా సాధించాడు అని అడగడం సహజం. విజయం సాధించినవాడు – తన ఎదుట ఉంచుకున్న గమ్యాలను, వాటి సాధనలో అతడు పొందిన కఠినమైన తర్ఫీదును గూర్చి తెలియజేస్తాడు – తన విజయానికి కారణాలు అవి అనేది అతని ఉద్దేశం. తప్పక స్వయం–క్రమశిక్షణ ఒక సాధనయే. అయితే తాను ఎంతటి తీర్మానంతోను, తర్ఫీదుతోను వెళ్లాడో యితరులు కూడా అంతే తీర్మానాలు, తర్ఫీదుతో వెళ్లారు. అయితే వారందరు నెగ్గలేదు. అతడు మాత్రమే ఎందుకు జయించాడు? అన్నిటికంటె అతి ప్రాముఖ్యమైనది, దేవుడే అతనికి ఆ వింతైన తలాంతును ప్రసాదించాడు. అతడు దాన్ని పెంచుకోవాలి తప్పదు, కాని తనకు అనుగ్రహింపబడిన సామర్థ్యం మనలో ఎక్కువ మందికి యివ్వబడలేదు.

మనకు ఏ విధమైన విజయము కలిగినా, అంటే – అది పరీక్ష పాస్ అవ్వడమే గాని, జట్టుగా తయారవ్వడమేగాని, పట్ట భద్రులవ్వడమేగాని, ఉద్యోగం సంపాదించు కొనడమేగాని, జంటను కనుగొనడమేగాని, యింటిని కొనడమేగాని, బిడ్డను కనడమేగాని, ప్రొమోషన్ రావడమేగాని, జబ్బునుండి తేరుకొనడమేగాని, లేక 100 మీటర్ల ఒలింపిక్స్‌లో గెలుచుకొనడమేగాని – దానిని కేవలం దేవుడు సాధ్యం చేశాడని గుర్తించడం అవసరం. "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును, పరసంబంధమైనదై జ్యోతిర్మ యుడగు తండ్రియొద్దనుండి వచ్చును" (యాకోబు 1:17). కాలు బంతి ఆటగాళ్లు ఒక క్షణంసేపు తలవంచి తమ ప్రేక్షకుల అభిమానానికి కృతజ్ఞత తెలిపినట్టు మనకు అవకాశం లేకపోవచ్చు – కాని మనం మన స్వరములెత్తి దేవునికి కృతజ్ఞతలు చెల్లింపవచ్చు, మన యెడల ఆయన చేసిన ఉపకారాలను యితరులకు చెప్పవచ్చు. దావీదువలె, మనకు కలిగిన యావత్తు, మనకు సమస్తాన్ని యిచ్చిన దేవునికి సమర్పించవచ్చు.

**(3) నీ బాధ్యతలను మరచిపోకు.**

అనేకులు శిఖరాగ్రానికి చేరుకున్నప్పుడు, వారు యిచ్చిన వాగ్దానాలను, చేసిన సమర్పణలను మరచిపోతూ ఉంటారు. అతడు బాధల్లో ఉన్నప్పుడు తాను పెండ్లి చేసికొన్న భార్య యిప్పుడు ధర్మ సంకటంగా మారినందున – ఆమెను త్రోసివేయవచ్చు. తోటి వ్యాపారితో చేసికొన్న నిబంధన నెరవేర్చలేనంత ఖరీదుగా మారిపోవచ్చు–గనుక దాన్ని అలక్ష్యం చేసి– "మేము దేనిమీద సంతకాలు పెట్టలేదు" అని సమర్థించ చూచుకోవచ్చు.

అలాటిది జరిగించవలసిన పరిస్థితికి దావీదు చేరుకున్నప్పుడు, దాదాపు 20 సంవత్సరాల క్రితం తాను యిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. సౌలుచేత అతడు ఎలా బాధింపబడ్డాడో దాని గూర్చి ఆలోచించితే, తన వాగ్దానాన్ని దావీదు తనకు అనుకూలంగా వదులుకున్నా ఎక్కువ మంది అతని తప్పుపట్టేవారు కాదు. దావీదు దానిని పవిత్రమైన శపథంగా ఆలోచించాడు. అది దేవుడైన యెహోవా సన్నిధిని చేయబడినందున,[69] దానినుండి తొలిగిపోకూడదని అతని ఆలోచన. గనుక యోనాతాను కుమారుని అతడు వెదకి వానిని అతడు ఘనపరచాడు.

మన అందరం సమర్పణలు చేసినవారమే లేక కట్టుబడినవారమే. మనలో ఎక్కువ మందిమి క్రైస్తవులం ప్రభువునందు మన విశ్వాసం ఒప్పుకొని, బాప్తిస్మం పొందినప్పుడు మన జీవితాలను ప్రభువునకు సమర్పించాం. మనలో అనేకులం భార్యను లేక భర్తను "ప్రేమించి, ఘనపరచి, కాపాడి" జీవితకాలం కట్టుబడియుంటామని సమర్పించుకున్నాం.[70] ఇంకా యితర విషయాల్లో కూడ మనం కట్టుబడియుండవచ్చు. సంఖ్యా. 30:2 ఆలోచించు: "ఒకడు యెహోవాకు మొక్కుకొనిన యెడల, లేక తాను బద్ధుడగుటకు ప్రమాణము చేసినయెడల, అతడు తన మాట తప్పక తన నోటనుండి వచ్చినదంతయు నెరవేర్చ వలెను." మన మాటలకు మనం కట్టుబడి యుండక పోయినట్లయితే, మన యథార్థతను మనం నిలబెట్టుకోలేం.

**(4) విజయము గతించిపోయేదని మరచిపోకు.**

ఒకనాడు నీవు "గుర్తింపుగలవాడవై" యుండవచ్చు, మరోనాడు నీకు అది "లేకపోవచ్చు." ఒక రోజు నీకు పది కోట్ల రూపాయలుండవచ్చు మరోనాడు అవి లేకపోవచ్చు. ఒకనాడు నీవు ఒక కంపెనీకి అధ్యక్షుడుగా ఉండవచ్చు తరువాత కావలివాడుగా మారిపోవచ్చు. ఒకనాడు నీవు ఆరోగ్యంగా ఉండవచ్చు. మరోనాడు ఇన్‌టెన్‌సివ్‌కేర్ యూనిట్‌లో ఉండవచ్చు. బిడ్డ కలిగిన తల్లిగా లేక తండ్రిగా నీవుండవచ్చు తరువాత హృదయం పగిలిన తండ్రిగా/తల్లిగా నీవు ఉండవచ్చు.

అతి శ్రేష్ఠమైనవారు సహితము ఎల్లవేళలా శిఖరాగ్రముననే ఉండరు. ఛాంపియన్ పెద్దవాడవ్వడంతో బయటికి నెట్టివేయబడవచ్చు. మిస్ ఇండియా 2001కి బదులు మిస్ ఇండియా 2002 వస్తుంది. నేటి గొప్ప కళాకారులు రేపటి గొప్ప కళాకారులచే తొలిగింపబడతారు. (అలా అన్ని రంగాల్లో జరుగుతునే ఉంటుంది)

విజయమనేది దావీదుకు నిరంతరం పోరాటంగా ఉండేది. అది ఏదో ఒక ట్రోఫీలో పెట్టుకుని జీవితమంతా అనుభవించేది కాదు. తాను జయించిన శత్రువులు తిరిగి లేచి అతని జీవితాన్ని యిబ్బందికరంగా చేశారు. ఏర్పాట్లు అతికింపబడకుండ వచ్చాయి, గనుక వాటిని మరల చేయవలసి వచ్చింది. ఒక గంటసేపటి విచక్షణా లోపం, కొన్ని నిమిషాలపాటు అదుపు తప్పిన కామం దావీదును శిఖరాగ్రంనుండి త్రోసివేసి, జీవితమంతా హృదయ వేదనతో గడిచేలా చేసింది. దీనిని తరువాత చూడబోతాం. ప్రాణంవలెనే విజయం కూడా, "కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరివంటిదే" (యాకోబు 4:14).

దేవుడు జీవితంలో నీకు కొంత విజయం యొక్క పరిమాణాన్ని ప్రసాదించితే, నీకు వీలైనప్పుడు దాన్ని అనుభవించు. విజయం కిటికీ సందులోగుండా ఎగిరిపోయినప్పుడు, ఆ కిటికీలోగుండా నీవును దూకాలి అనే శోధనలో పడకుండునట్లు జాగ్రత్తపడు. నిజమైన విజయం, అంతమందు, "భళా నమ్మకమైన మంచి దాసుడా" అని ప్రభువుచేత పిలిపించుకొనడమే (మత్తయి 25:21; KJV).

**(5) లోనుకాగల నీ స్థితిని మరచిపోకు.**

దావీదు విజయమంతా కొంచెం సేపటిలోనే పాడుచేసిన సంఘటనను ఎదురు చూడకుండ నేను ఈ పాఠాన్ని ముగించలేను. అత్యధికమైన విజయం సాధించినవారు, నాల్గు విషయాల్లో పడిపోతారని ఒక ప్రసంగీకుడన్నాడు.[71] "వెండి," "బద్ధకం," "కామం," లేక "అహంభావం." వెండి దావీదుకు శోధన కానేరదు. కాని మిగిలిన మూడు దాదాపుగా దావీదును నాశనం చేశాయి. దావీదు దయగలవాడు. యెహోవా దేవుని స్తుతించేటప్పుడు, ఆయన కొరకు యుద్ధాలు చేసేటప్పుడు, లేక భవిష్యత్తు కొరకు భారీ ఎత్తున ప్లాన్ చేసేటప్పుడు అతడు శ్రేష్ఠంగా కన్పిస్తాడు. ఏదియెలాగున్నా, అతని బలమే బలహీనతగా మారింది. అందమైన స్త్రీల యొద్దకు వచ్చినప్పుడు అది బయటపడింది. సోమరితనం, లైంగిక శోధన, స్వార్థపరత్వం అనే ఈ మూడు ఒక సాయంకాలాన ఒకదానితో ఒకటి దగ్గరకు చేరుకున్నాయి. దావీదు ఫెళ్లున పడద్రోయబడ్డాడు; తన దేశ వ్యాప్తంగా అది

ప్రతిధ్వనించింది.

లోనుకాగల తన స్థితిని దావీదు తగినంతగా ఎరుగలేకపోయాడు. ఒకవేళ దాన్ని ఎరిగియున్నా, తన్ను తాను కాపాడుకొనడానికి దాని విషయంలో తగినంత శ్రద్ధను అతడు తీసికొనలేదు. "ప్రతివాడును తన **స్వకీయమైన దురాశచేత** ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును" అని యాకోబు అన్నాడు (యాకోబు 1:14; ఒత్తి పలికింది నాది). మనలో ప్రతి ఒక్కరం లోనుకాగల స్థితిలోనే ఉన్నాం. మనలో ప్రతివానికి తన సొంత బలహీనతలుంటాయి. నా బలహీనతలే నీ బలహీనతలు కానవసరం లేదు. లేక నీవి, నావి కావలసిన అవసరత లేదు. శోధన పరిస్థితులనుండి తప్పింపబడడానికి గాను ప్రతి ఒక్కడు తన బలహీనతలను ఎరిగినవాడైయుండాలి. ఒకటి మాత్రం నిశ్చయం: నీ బలహీనత ఏదో **అపవాదికి** తెలుసు, నిన్ను పాడుచేయడానికి వాడు ఏ ప్రయత్నమైనా చేస్తాడు.

ఇంతవరకు నీవు అలా చేయనట్లయితే, నీవు ఏ విషయాల్లో లోనయ్యే స్థితిలో నిలిచియున్నావో దాన్ని గ్రహించడానికి గాను తీవ్రంగా ఆత్మ పరిశోధన చేసికో; ఆ ప్రాంతంలో శోధింపబడకుండ తప్పించుకొనడానికి ప్రయాసపడు.

## ముగింపు

బంగారు పతకాలను జయించుకున్న వారిని గూర్చి మాత్రమే మనం మాట్లాడడం లేదు. లేక పెద్ద జీతగాళ్లను గూర్చో లేదా టైమ్ మేగజైన్ కవరు మీద పడే ఫోటోలవారిని గూర్చి కూడా మాట్లాడడం లేదు. నేడు మనం యిక్కడున్నాం అనే వాస్తవాన్ని బట్టి జీవితంలో దేవుడు మనకు కూడా ఎంతో కొంత విజయాన్ని ప్రసాదించాడు. అయితే దావీదు యొక్క విజయంనుండి ఒకవైపు దేవునికి మహిమ చెల్లించు, మరోవైపు ఆ విజయం తీసికొనివచ్చే గోతుల్లో పడకుండ తప్పించుకొనడానికి ప్రయత్నించు.

ప్రభువైన యేసు తన శిష్యులను ఒకప్పుడు యిలా ప్రశ్నించాడు: "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము?" (మత్తయి 16:26) ప్రభువు యొక్క ప్రశ్నను మనం పెంచితే, ఈ లేఖన భాగానికి మనం అన్యాయం చేసినవారం కామని నా ఆలోచన: ఒకడు లోకమంతయు సంపాదించుకొని, తన వివాహాన్ని పోగొట్టుకొంటే వానికేమి ప్రయోజనము? ఒక స్త్రీ లోకమంతటిని సంపాదించుకొని, తన సొంత పిల్లలను పోగొట్టు కొంటే ఆమెకేమి ప్రయోజనము? ఒక మనుష్యుడు సర్వలోకమును సంపాదించుకొని, తన శీలాన్ని పోగొట్టుకొంటే వానికేమి ప్రయోజనము? ఒక స్త్రీ లోకమంతటిని సంపాదించుకొని, తమ మంచితనాన్ని పోగొట్టుకుంటే ఆమెకేమి ప్రయోజనము? ఈ ప్రశ్నలన్నిటి జవాబు ఒక్కటే: ఏమి ప్రయోజనం లేదు అనేదే. అతి ప్రాముఖ్యమైన దానిని నీవు పోగొట్టుకున్నప్పుడు, లోకంలో నీవెంతో విజయవంతంగా ఉన్నా, నీవు అతిగొప్ప పరాజితుడవే.

## ప్రసంగపు నోట్సు

మెఫీబోషెతు కథ మనస్సు కరిగించేది; లోపాలను జయించడానికి ఆధారంగా దాన్ని ఉపయోగించవచ్చు - లోపాలు గలవారియెడల మన తత్వం ఎలా ఉండాలి? అనేదానికి కూడా ఉపయోగించవచ్చు.

కృపచేతనే రక్షణ అని బోధించే పాఠాలకు కూడా ఈ కథను వాడవచ్చు. దావీదు యువకుని ఎలా చూచాడో గుర్తించు (వ్యక్తిగతమైన విలువనుబట్టి కాదు, ప్రభువైన యేసు ఏమి చేశాడో దాన్నిబట్టి మనయెడల దేవుడు చూచినట్టు). ప్రభువైన యేసు ఏమిచేశాడో దాన్ని బట్టి).

యోవాబు ఉపన్యాసంలోని నా నాల్గు పాయింట్లు సూక్ష్మ బుద్ధిగల విద్యార్థి గ్రహించే ఉంటాడు: "సహకారం," "ధైర్యము," "అక్కర," "ఏకీభవించు." 2 సమూయేలు 10లోని ఆ మాటలు స్థానిక సంఘం పనికి, విజయానికి ప్రోత్సహించే బలమైన సందేశమై యుంటుంది.

అనేకమైన కీర్తనలు అనుబంధ పాఠాలుగా రూపొందింపవచ్చు.దావీదు విజయాన్ని గూర్చిన కీర్తనలను గూర్చి చూడు. హమాతు రాజు దావీదు వద్దకు వచ్చినప్పుడు 18వ కీర్తన వ్రాయబడిందని కొందరు తలంచుతారు. (43నుండి 45 వచనాలవరకు గమనించు). కీర్తన 60 ఈ పాఠానికి నేరుగా జత కూడుతుంది.

---

సూచనలు

[1]8వ అధ్యాయం ప్రారంభ వాక్యాలు అంశ క్రమాన్ని సూచించేవిగా గాక, క్రొత్త అంశానికి తోడుకొనిపోయే వంతెనవంటి పద ప్రయోగములై యుండవచ్చు. [2]"దావీదు ఫిలిష్తీయులను ఓడించి లోబరచుకొని వారి వశమునుండి మెతెగమ్మాను పట్టుకొనెను" అనేది అక్షరార్థమైన హెబ్రీ తర్జుమా (KJV). మెతెగమ్మాకు అక్షరార్థం–"తల్లి పట్టణం యొక్క కళ్లెమును పట్టుకున్నాడు" (ASV చూడు) ఈ విధంగా దావీదు "తల్లి పట్టణాన్ని" స్వాధీనం చేసికొన్నాడు. [3]"తల్లి పట్టణం" గాతు అని దినవృత్తాంతముల రచయిత అంటున్నాడు. "దావీదు ... గాతు పట్టణమును దాని గ్రామములను ఫిలిష్తీయుల వశమున నుండకుండ ..." (1 దినవృ. 18:1). [4]ఈ ఎదుర్కోలులు ఎప్పుడు సంభవించాయో మనం కేవలం ఊహించవలసిందే. 2 సమూ. 21లోని నాల్గు యుద్ధాలు దావీదు పారిపోతున్నప్పుడు గాని, లేదా అతడు కేవలం యూదాను మాత్రమే ఏలుచుండిన 71/2 సంవత్సరాల కాలంలోగాని జరిగియుండాలని అంటారు. అంటే, 2 సమూ. 5కు ముందు మరియు 2 సమూ. 8:1కి ముందు అయ్యుండాలట. దావీదు జీవితంలోని "తరువాత కాలంలో" జరిగి యుండవచ్చునని మరికొందరు అంటారు. దావీదు అలసిపోడానికి కారణం అదట (2 సమూ. 21:15). [5]బల్లెం గొల్యాతు బల్లెము అంత పెద్దది కాకపోయినా, అది సమ్మెటకంటె ఎక్కువ బరువే తూగవచ్చు! [6]అది "క్రొత్త ఖడ్గము" (2 సమూ. 21:16). [7]1 సమూ. 26:6–9; 2 సమూ. 16:8, 9; 19:21. [8]2 సమూ. 23:24. [9] 2 సమూ. 21:19లో శూరుని పేరు గొల్యాతు; 1 దినవృ. 20:5లో అతని పేరు గొల్యాతు సహోదరుడైన లహ్మీ అని ఉంది. "గొల్యాతు" అనేది కుటుంబపు పేరు, లహ్మీ వ్యక్తిగతమైన పేరైయుండవచ్చు. అతని సహోదరుని పేరు గొల్యాతు అనబడిన గొల్యాతుయై ఉండవచ్చు. "ఎల్హానాను" అనేది దావీదుకు మరొక పేరని కొందరంటారు. ఇది నిజం కాకపోవచ్చు ఎల్హానాను తండ్రిపేరు యాయీరు (1 దినవృ. 20:5). దావీదు యొక్క బలశూరుల పట్టిలో అతని పేరు ఉంది (2 సమూ. 23:24). దావీదు తన గొల్యాతు నెదుర్కొన్న చాలా కాలానికి ఈ సంఘటన జరిగింది. [10]అక్రమ సంబంధంవలన మోయాబీయులు ఉనికిలోనికి వచ్చారు (ఆది. 19:37).

[11]రూతు 4:17-22. [12]1 సమూ. 22:3, 4. [13]అమ్మోనీయులు మినహాయింపబడియుండవచ్చు (2 సమూ. 12:31 నోట్సు చూడు). [14]సైనికులలో మూడింటికి రెండు వంతులో, జనాభాలో మూడింటికి రెండు వంతులో లేఖనం స్పష్టంగా చెప్పలేదు. [15]Robert Jamieson, A. R. Fausset, and David Brown, *Commentary on the Whole Bible*, rev. ed. (Grand Rapids, Mich.: Zondervan Publishing Co., 1961), 233. [16]2 సమూ. 8:12. 2 సమూ. 10-12 అమ్మోనీయులపై దావీదు విజయం వివరాలను యిస్తాయి. [17]అమ్మోనీయులు కూడా అక్రమ సంబంధానికి పుట్టినవారే (ఆది. 19:38). [18]దినవృత్తాంతాలలోని సమాంతరపు లేఖన భాగాలను చదువుతుంటే, సంఖ్యలు, పేర్లు, వగైరాలలో వ్యత్యాసం గోచరిస్తుంది. అదే ప్రజలకు వేరే పేర్లు స్థలాలు సూచింపబడ్డాయా? ఏమి జరిగిందో మనం చెప్పలేం. సాధారణంగా 2 సమూయేలులో యివ్వబడిన వాటిని సహజంగా వాడతాం. [19]గుర్రములు "శీలమండ నరములను" కోస్తే అవి యుద్ధానికి పనికిరావు. అలా చేయడంవలన చంపడం కంటె వాటికి దయ చూపినట్టే, దావీదుకు అవి పనికిరావు. (ఎందుకంటే రాజులు గుర్రాలను అధికంగా కూర్చుకొన కూడదని దేవుడు ఆదేశించాడు [ద్వితీయో. 17:16]. పైగా కొండసీమయైన ఇశ్రాయేలు దేశంలో రథములు అంతగా పనిచేయవు.) పైగా శత్రువు తిరిగి వాటిని ఉపయోగించుకొనడానికి వీలులేదు. అందువలన అవి నాశనం చేయబడ్డాయి. ఒక వంద రథాలకు సరిపోవునంతవరకు దావీదు ఉంచుకున్నాడు. దావీదు మాటలనే కీర్తన. 20:7లో గమనించు. [20]NASB మొదటి తర్జుమా "సిరియనులు" అని ఉంది, తరువాత తర్జుమా "అర్మేనీయులు" అని చేసింది. ఇది ఆది భాషకు దగ్గరగా ఉంటుంది (2 సమూ. 10:6 చూడు). సిరియనులన్నా అర్మేనీయులన్నా ఒకే జనాన్ని సూచిస్తుంది.

[21]1 దినవృ. 18:8; 26:26నుండి; 1 రాజులు 7:5; 2 దినవృ. 5:1 గమనించు. [22]హమాతు దమస్కుకు రమారమి ఉత్తర దిశగా 100 మైళ్ళ దూరంలో ఉంటుంది. [23]హమాతు రాజు దావీదుతో సంధి చేసికొన్నట్టున్నాడు - దావీదు అధికారం క్రింద తన్ను తాను నిలుపుకొనడం ద్వారా ఈ పని జరిగించినట్టున్నాడు. [24]ముందుగా దావీదు అమాలేకీయులను ఓడించాడు (1 సమూ. 30). [25]1 దినవృ. 22:14. [26]కీర్తన 60 యొక్క నోట్స్, విజయాన్ని యోవాబుకు ఆరోపించింది. దినవృత్తాంతముల రచయిత దానిని యోవాబు సహోదరుడైన అబీషైకి ఆరోపించింది (1 దినవృ. 18:12). దావీదు సైన్యానికి అధిపతి యోవాబు, అయితే అభిషై ఒక భాగాన్ని నడిపించి విజయాన్ని సాధించియుండవచ్చు. [27]2 సమూ. 8:13లో "ఎదోమీయులని" సెప్టూజెంటు, సిరియా తర్జుమా హెబ్రీ చేతిప్రతులలో సూచిస్తున్నాయి. [28]కీర్తనకు ముందున్న పరిచయాన్ని చూడు. [29]దీన్ని గుర్తుపెట్టుకో. ప్రజల హృదయాలను ఆకట్టుకొనడానికి అబ్షాలోము పన్నిన పన్నాగం. [30]1 దినవృ. 16:39. తరువాత సాదోకు మందసం పనిలో ఉన్నాడు (2 సమూ. 15:24-29). 1 దినవృ. 6:3-8, 50-53ల ప్రకారం సాదోకు అహరోను సంతతివాడు (1 దినవృ. 24:3).

[31]అహీమెలెకు కూడా అహరోను సంతతివాడే. అయితే అతడు మరొక మార్గం గుండా వచ్చాడు. 2 సమూ. 8:17లో కొంచెం తారుమారుగా ఉన్నట్టుంది-అబ్యాతారు అహీమెలెకు కుమారుడా లేక అహీమెలెకు అబ్యాతారు కుమారుడా? (సౌలు యాజకులను సంహరించినప్పుడు 1 సమూ. 22:20లో దావీదు చెంతకు చేరేవాడు ఎవడు? అప్పటినుండి సాదోకును అబ్యాతారును యాజకులుగా గుర్తింపబడతారు (2 సమూ. 17:15; 20:25). దావీదు చెంత చేరిన అబ్యాతారుకు అహీమెలెకు అనే కుమారుడు ఉండవచ్చు, లేక అబ్యాతారు అహీమెలెకు అనేవి ఒకదానికి బదులు ఒకటి వాడే పదాలై యుండవచ్చు. [32]2 సమూ. 23:20-23. [33]క్రేతునుండి వచ్చిన కొలిమి పనివారు చెరెత్తీయులు. [34]గోత్రాల మధ్య అంతరంగ కలహాలు రాకుండ ఈ పనులకు దావీదు అన్య దేశీయులను ఉపయోగించుకొన్నట్టున్నాడు. [35]2 సమూ. 8:18లోని దావీదు కుమారులు-"సభా ముఖ్యులు" రాజునకు సలహాదారులని NIV తెలుపుతోంది. వారు యాజకులయ్యే అవకాశం లేదు. [36]Burton Coffman, *Commentary on Second Samuel* (Abilene, Tex.: ACU Press, 1992), 114. [37]2 సమూ. 9లోని సంఘటనలు తరువాత 2 సమూ. 21 జరిగియున్నట్టయితే, సౌలు యొక్క యితర సంతతివారును బ్రతికి ఉన్నట్టున్నారు. "యోనాతానును బట్టి నేనతనికి దయ చూపుతానన్న" విషయం సీబా యింతకు ముందే వినియుండవచ్చు. [38]"మెరిబ్బాల్" (లేక "మెరిబ్బయలు") అనేదాని అర్థం అనిశ్చయమైనది. 1 దినవృ. 8:34 చూడు. [39]2 సమూ. 4:4 చూడు. [40]మాకీరు సౌలును, సౌలు యింటిని నమ్మకంగా బలపరచే వాడైయున్నట్టున్నాడు. మెఫీబోషెతుకు దావీదు దయచూపిన తరువాత మాకీరు దావీదు అనుచరుడును సపోర్టర్నైయ్యాడు (2 సమూ. 17:27-29).

[41]లోదెబరు నిజంగా ఎక్కడుందో తెలియదు. [42]మెఫీబోషెతు కుమారుని పేరు మీకా (2 సమూ. 9:12) మీకా గర్భఫలం ఇశ్రాయేలులో ప్రముఖులయ్యారు (1 దినవృ. 8:34-40; 9:40-44 చూడు). [43]బత్షెబా యొక్క తండ్రి అమ్మీయేలు అని పిలువబడ్డాడు (1 దినవృ. 3:5). మాకీరు తండ్రియైన అమ్మీయేలు ఒకటా కాదా, మాకీరు బత్షెబా అన్న

చెల్లెండ్లా కాదా–ఆలాగున మాకీరు దావీదుకు బావమరిది ఔతాడా అనే ఊహలు ఉన్నాయి. [44]మత్తయి 2:8. [45]మెఫీబోషెతు మోయబడియుండవచ్చు. [46]దావీదు అతని పేరున పిలిచాడు (2 సమూ. 9:6). అతడు నిజంగా తన స్నేహితుని కుమారుడో కాదో నిశ్చయించుకొనడానికి దావీదు మెఫీబోషెతును అలా పిలిచాడని నేననుకుంటాను. [47]వంగి నమస్కరించడం రాజ సముఖములోనికి వచ్చే సహజమైన విధానం. [48]కుక్కవంటివాడననడం తన్ను తాను తగ్గించుకొనడమే. దావీదు సౌలు ఎదుట అలాగే ఉపయోగించాడు (1 సమూ. 24:14). [49]2 సమూ. 9:9–11. తరువాత జరిగిన సంభవాలను బట్టి (2 సమూ. 16:1–4), సీబా యిష్టంలేకుండగనే అంగీకరించినట్టు కన్పిస్తుంది. [50]మెఫీబోషెతు యొక్క కథ అయిపోలేదు. ఒక సందర్భంలో దావీదు అతని ప్రాణాన్ని ఉండనిచ్చాడు (2 సమూ. 21:7, 8). దావీదు అబ్షాలోము యొద్దనుండి పారిపోయేటప్పుడు తిరిగి మెఫీబోషెతు కథలోనికి వస్తాడు (2 సమూ. 16:1–4; 19:24–30).

[51]ఇది కాలక్రమానికి సంబంధించిన ప్రతిపాదనకంటె రెండింటిని కలిపే ప్రతిపాదనయై యుండవచ్చు. [52]నాహాషు సౌలుకు శత్రువైయున్నందున (1 సమూ. 11:1–11), సౌలునకు వ్యతిరేకంగా అతడు దావీదుకు దయచూపియుండవచ్చు. [53]రబ్బా అనేది 2 సమూ. 10:3లో ప్రస్తావించబడిన “పట్టణం”. యొర్దాను నదికి తూర్పునను ఎరికోకు 23 మైళ్లు తూర్పు దిశగాను రబ్బా ఉంది. అది నేడు జోర్డానుకు రాజధాని నరగమై అమ్మాను అని పిలువబడుతుంది. [54]యెషయా 20:4 చూడు. [55]“రెండువేల మణుగుల వెండి యిచ్చి బాడిగెకు కుదుర్చుకొనిరి” అని దినవృత్తాంతముల రచయిత అంటున్నాడు (1 దినవృ. 19:6). [56]అమ్మానుకు పొరుగు దేశాలుగా మాకా మరియు టోబు అనేవి ప్రస్తావించబడ్డాయి. [57]సోబా రాజైన హదరెజరు ప్రధానంగా యుద్ధానికి రేపేవాడైయున్నాడు (2 సమూ. 10:16, 19). 8వ అధ్యాయంలో అతడు దావీదుతో యుద్ధం చేసిన సంగతిని ముందుగానే చూచాం (3, 5, 7–10 వచ.). 8వ అధ్యాయంలోను 10వ అధ్యాయంలోను జరిగిన యుద్ధాల మధ్య సంబంధం నిశ్చయంగా తెలియదు. [58]సిరియనులు దావీదుకు దాసులై కప్పము చెల్లించువారైయుండిరి అనేది 2 సమూ. 8:6తో జతకూడుతుంది. [59]2 సమూ. 11:1. [60]1 దినవృ. 20:1–3.

[61]2 సమూ. 11:1, 17–24. [62]2 సమూ. 12:27. “జలములమీద పట్టణమును పట్టుకొనిరి” NASB, KJV, RSV “the city of waters” అని The NIV “its water supply” అని అంటాయి. [63]ఎవరు ఒక పట్టణాన్ని పట్టుకుంటారో కొల్లసొమ్ము సహజంగా వారిదే ఔతుంది. దావీదు దానికి అర్హుడు కాకపోయినా, యోవాబు రాజునకు తన నమ్మకత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. [64]“రాజు” అనే పదం అమ్మోనీయుల దేవత అని కూడా తర్జుమా చేయవచ్చు. మణుగు బంగారమంటే 100నుండి 125 పౌన్లు కావచ్చు. అలాటి కిరీటాలు ధరించుకొనడానికి గాక అలంకారం కొరకు ఉపయోగించ వచ్చు. ఆ కిరీటం విగ్రహం తలపైనున్నట్టు అనేకులు తలంచుతారు. ఒక కిరీటం కొన్ని కోట్ల రూపాయలు అవ్వవచ్చు. [65]అమ్మోను తరువాత దావీదుకు సహాయం చేశాడు (2 సమూ. 17:27), దావీదు వారిని హింసపెట్టనట్టు నేను నమ్మను. అందువలన నేను NIV తర్జుమాను ఉపయోగిస్తున్నా. మోయాబీయులను దావీదు ట్రీట్ చేసిన విధాన్ని గూర్చి ఆలోచించినప్పుడు, దావీదు అమ్మోనీయులను హింసపెట్టే అవకాశమున్నట్టు గోచరిస్తుంది. [66]ఐగుప్తు నది అంటే నైలు–దేశ పటాన్ని చూడు. [67]1 రాజులు 4:21–24 గమనించు. [68]మత్తయి 22:37, 38; 6:33. [69]దావీదు వాగ్దానం దేవుని సముఖంలో జరిగింది (1 సమూ. 20:16, 17 చూడు). [70]మత్తయి 19:3–9 చూడు.

[71]Charles R. Swindoll's study guideలో**,** ప్రసంగికుని పేరు ప్రస్తావించలేదు, *David: A Man After God's Own Heart* (Fullerton, Calif.: Insight for Living, 1988), 80.